


కలెక్టర్ దృష్టికి సిఆర్‌టిల సమస్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సిఆర్‌టిలందర్నీ రెన్యువల్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను కలిసి సమస్య వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఈ అధికారులే సిఆర్‌టిలందర్నీ రెన్యువల్ చేయగా ఈ ఏడాది ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారో కారణం తెలియదన్నారు. మీరే కల్పించుకొని సిఆర్‌టిలకు న్యాయం చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ పాత పిఒతోనూ, త్వరలోనే బాధ్యతలు చేపట్టబోయే కొత్త పిఒతో ఈ సమస్య గురించి మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయితే సమస్య పరిష్కారయ్యేంత వరకు దీక్షల కొనసాగుతాయని నాయకులు తెలిపారు.



మళ్లీ మోసమే

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఒరింగింది శూన్యం
- వెల్లువెత్తుతున్న విమర్శలు
- సమర్ధించుకుంటున్న టిడిపి నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. బడ్జెట్ ద్వారా ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఒరింగింది శూన్యం. జిల్లాకే కాదు, ఉత్తరాంధ్రాకి, రాష్ట్రానికి కూడా ప్రయోజనాలేవీ లేవని ప్రతిపక్ష వైసిపి, సిపిఎం, సిపిఐ తదితర పార్టీ నాయకులు మొదలు, మేధావులు, సాధారణ ప్రజానీకం వరకు విమర్శిస్తున్నారు. టిడిపి, జనసేన నాయకులు మాత్రం ఈ బడ్జెట్ రాష్ట్రానికి శుభ పరిణామం అంటూ సమర్ధించుకుంటున్నారు. మంగళవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మినహా మిగిలిన ఏ ఒక్క అంశానికి కూడా నిర్దిష్టమైన కేటాయింపులు లేవు. ఈ నిధులను కూడా ఆర్థిక సంస్థల ద్వారా సమకూరుస్తామని చెప్పడం గమనార్హం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ఎంత కేటాస్తారనేది చెప్పలేదు. గడిచిన ఆగస్టు 25న ఈ వర్సిటీ నిర్మాణ పనుల శంకుస్థాపన కేంద్ర కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.834కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ నిధులు విడుదల చేయలేదు. ఈ బడ్జెట్ సమావేశంలోనైనా నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసినవారికి నిరాశే ఎదురైంది. దేశంలోని ఉన్నత విద్యాసంస్థలన్నింటికీ కలిపి రూ.15,472కోట్లు కేటాయించారు. ఇందులోనే ఎంతో కొంత మన జిల్లాలోని గిరిజన వర్సిటీకి వస్తుందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇది ఆవగింజలో అరవైవ వాటాయేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా మీదుగా కొత్తరైళ్ల ఏర్పాటు లేదా లైన్లు, స్టేషన్ల ఆధునీకరణ వంటి ప్రస్తావన కూడా లేదు. విశాఖ రైల్వే జోన్ ఊసేలేదు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం తప్ప, అమలుపై చిత్తశుద్ధితో మాట్లాడలేదు. గతంలోనూ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా అమలు కాలేదు. దీని అమలుపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. విభజన చట్టం ప్రకారం ఏటా రూ.50కోట్ల చొప్పున జిల్లాకు ఇవ్వవాల్సిన బిజెపి ప్రభుత్వం ఒకే ఒక్క సంవత్సరం ఇచ్చి ఆ తరువాత కేటాయించిన నిధులు కూడా వెనక్కి తీసుకుంది. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు రూ.64కోట్లు మించి అందలేదు. దీంతో, కీలకమైన విద్యాసంస్థలు, సాగునీటి ప్రాజెక్టులు, కొత్త పరిశ్రమలు అభివృద్ధి చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పారిశ్రామిక వృద్ధి క్రమంగా కుంటుబడింది. జ్యూట్ పరిశ్రమలు దాదాపు కనుమరుగైపోతున్నాయి. ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి మన జిల్లా, రాష్ట్రంపై మరోసారి చిన్నచూపు చూసిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

గిరిజన యూనివర్సిటీకి నిధులేవీ?



ఎపి రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న 15వేల కోట్లు రుణమా, ఆర్థిక సాయమా స్పష్టత లేదు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీకి నిధులు మంజూరు చేసిన దాఖలాల్లేవు. విశాఖ రైల్వే జోన్, ఉక్కు ప్రయివేటీకరణ అంశాలపై స్పష్టత ఇవ్వలేదు. పేదలు, గిరిజనుల దృష్టిలో చూస్తే ఇది నిరాశాజనక బడ్జెట్.

పి.రాజన్నదొర, మాజీ డిప్యూటీ సిఎం.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్



రాష్ట్ర ప్రజలు ఆకాంక్షలను నెరవేర్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం, అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు, పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం ప్రకటించింది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివద్ధికి నిధులు కేటాయించింది. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు సాధించడం రాష్ట్ర ప్రభుత్వం విజయం.

బి.విజయచంద్ర
ఎమ్మెల్యే, పార్వతీపురం.

నిధుల కేటాయింపులు స్పష్టత లేని బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు మంజూరు విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆశగా ఎదురుచూసిన రాష్ట్ర ప్రజలకు నిరాశే మిగిలింది. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించింది. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. రూ.15 వేల కోట్లు నిధులు నేరుగా ప్రకటించాలి. వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం అన్యాయం.

రెడ్డి వేణు,
సిపిఎం జిల్లా కార్యదర్శి.

ఉత్తుత్తి హామీలే...



పదేళ్లు గడిచినా కేంద్రీయ గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించకపోవడం అన్యాయం. దీనిపై మన రాష్ట్రానికి చెందిన పాలకులు మాట్లాడకపోడం మరీ దారుణం. ప్రత్యేక ప్యాకేజీ కూడా విడుదల చేయకపోవడం వల్ల విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం సహా ఉత్తరాంధ్ర వెనుకబడిపోతోంది. సాగునీటి ప్రాజెక్టులు లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నాయి. పారిశ్రామిక వృద్ధి కుంటుబడింది. వ్యవసాయ రంగం దివాలా తీసింది. సేవారంగంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఎం.శ్రీనివాసా
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఇఎంఆర్ఎస్ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఇఎంఆర్ఎస్) పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన అనసభద్రలో ఇఎంఆర్ఎస్ భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యతలో రాజీ ఉండరాదన్నారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మిటరీ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాన్ని గుర్తించి తదనుగుణంగా మంచాలు, ఫ్యాన్లు, కప్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ విధిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని విపులంగా పరీక్షించి విద్యార్థుల భద్రత, రక్షణ దిశగా చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పనసభద్రలో జరుగుతున్న పాఠశాల తరగతులను, వంట గదిని పరిశీలించి, ఆహార పదార్థాలు తయారీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటకు, తాగునీటికి కలుషితం లేని నీటిని వినియోగించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. స్థానిక పిల్లలను దృష్టిలో పెట్టుకొని విద్యా బోధన ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి అన్ని అంశాల్లో ప్రతిభావంతునిగా తయారు కావాలన్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో విద్యార్థులు విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పనసభద్ర లో ఆయిల్ పామ్ క్షేత్రాలను పరిశీలించి కలెక్టర్ మొక్కలను నాటారు. అంతర పంటలు వేయాలని సూచించారు. అనాస పనస వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. వాణిజ్య పంటలు దిశగా రైతులు అడుగులు వేయాలని తద్వారా ఆర్థిక అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గ్రామస్తులతో మాట్లాడినకలెక్టర్ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. బహిరంగ మలవిసర్జన ఎక్కడా ఉండరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.రుక్మాంగదయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గృహ నిర్మాణంలో వంద రోజుల లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులతో తన కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. స్థానిక వనరులు ఉపయోగించి గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయుటకు కృషి చేయాలని ఆయన అన్నారు. విడివికె, స్థానికుల ద్వారా ఇటుకల తయారీ అక్కడే చేయడం తదితర అంశాలను పరిశీలించాలని చెప్పారు. పిఎం - జన్ మాన్ కింద మంజూరు చేసిన 2375 గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జన్ మాన్ ఇళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సచివాలయం సిబ్బందిని అవసరం మేరకు వినియోగించుకోవాలని చెప్పారు. సొంత స్థలాల్లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇలు మోహన రావు, సోమేశ్వరరావు, సిఎల్‌టిసి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

విడివికె ద్వారా రూ.2.26కోట్లు మార్కెటింగ్

ప్రజాశక్తి - సీతంపేట




స్థానిక ఐటిడిఏ పరిధిలో 121 విడివికె వన్‌దన్ వికాస కేంద్రాల ద్వారా ఈ ఏడాది రూ. 2.26కోట్లు మార్కెటింగ్‌కు లక్ష్యంగా పెట్టుకున్నామని వెలుగు ఎపిడి ఎం.సన్యాసిరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఐడిబిఐ పరిధిలో ఏడు మండలాల్లో ఇప్పటికే రూ.48 లక్షలు మార్కెటింగ్ సేల్స్ చేశామన్నారు. మార్చి నెలాఖరుకు లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఒక్కొక్క విడివికె కేంద్రానికి రూ.6.50లక్షలు లక్ష్యమిచ్చామన్నారు. వీటిలో పిఎం జన్మన్ విడివికెలు 53గానూ 5, 118 సభ్యులకు రిజిస్ట్రేషన్ చేసి మార్కెటింగ్ ఉపాధిపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. 22,000 కొండ చీపుర్లు కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. జీడి, కొండచీపుర్లు ప్రధానంగా కొనుగోలు చేస్తున్నామని, అదే విధంగా జిసిసి ద్వారా మిల్లెట్స్ పౌడర్ 1.3 టన్నుల మిల్లెట్ పౌడర్ జిసిసి ద్వారా హాస్టల్‌కు అందించామని తెలిపారు. విడివికెలో తయారు చేసిన అగరబత్తులు, పసుపు ప్యాకింగ్ చేసి ఢిల్లీకి సరఫరా చేశామని చెప్పారు. ఇంకా విడివికెల ద్వారా మార్కెటింగ్ ఎక్కువ చేసి సభ్యులకు ఆర్థిక స్వావలంబన పెరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే బ్యాంకు లింకేజీలో రుణాలతో పాటు రికవరీ అదేస్థాయిలో చేస్తున్నామని అన్నారు. ఉన్నతాధికారుల సహకారంతో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడుతామని స్పష్టం చేశారు.

శివారు ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమే

- పూడికలతో నిండిపోయిన కాలువ
- నత్తనడకన ఆధునీకరణ పనులు
- ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పెద్దగెడ్డ జలాశయం నుంచి ఈ ఖరీఫ్‌కు శివారు ఆయకట్టు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమేనని రైతులు వాపోతున్నారు. దీనికి ప్రధాన కారణం జలాశయం ప్రధాన పిల్ల కాలువల్లో పూడికలు పేరుకుపోయి. మూడేళ్లయినా 10 శాతానికే ఆధునీకరణ పనులు పరిమితమయ్యాయి. దీంతో శివారు ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరందే పరిస్థితి లేదు. ముఖ్యంగా కాలువల్లో పూడికలు, చెత్త చెదారంతో పేరుకుపోయాయి. ఈ పూడికలు తొలగించకపోవడంతో శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ఈ విషయమై అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రతి ఏటా ఈ దుస్థితి నెలకొంటుందని ఆరోపిస్తున్నారు. అధికారులు ఏడాదికి రెండు మూడుసార్లే జలాశయం సందర్శన ఉంటుందని, మిగతా సమయంలో వారి జాడ కనిపించడం కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సంకటాలతో సాగునీరు సక్రమంగా ఎలా అందుతుందని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో కీలకమైన పెద్దగెడ్డ జలాశయం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004లో పనులు ప్రారంభించి 2006లో ప్రారంభించారు. ఈ జలాశయం నుండి పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు సంబంధించి 12 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. జలాశయం ప్రధాన కుడి కాలువ ద్వారా 7,500 ఎకరాలకు, జలాశయం అనుసంధానమైన కర్రివలస వేగావతి ఆయకట్టు కుడి ఎడమ కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరందుతుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 213.8 కాగా ప్రస్తుతం 213.6 మీటర్ల నీరు నిల్వ ఉంది. ఈ నీరు నిల్వతో ఈ ఖరీఫ్ సాగుకు ఢోకా లేదు. అయితే ప్రధాన సమస్య ఆధునీకరణ పనులు 10 శాతానికే పరిమితం కావడం, ప్రధానంగా పిల్ల కాలువలు పూడికలతో నిండిపోవడంతో ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందే అవకాశం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే పిల్లకాలువల్లో పూడికలు తొలగించి శివారు ఆయకట్టుకు సాగునీరందరించాలని రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో పేరుకుపోయిన సాగునీటి కాలువ



ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకు పంట

పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని కుదమ పంచాయతీలో నాలుగు రోజులుగా అడవి ఏనుగులు గుంపు తిష్ట వేశాయి. మంగళవారం గుంట్రెడ్డి రమేష్ నాయుడుకు చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటను పూర్తిగా నాశనం చేశాయి. అలాగే మరో మూడు ఎకరాలకు వరి నారుమళ్లు ధ్వంసం చేశాయని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గుంట్రెడ్డి శ్రీనివాసరావు, మంత్రబుడ్డి అప్పలనాయుడు, గంట సత్యనారాయణ, బోను గౌర్నాయుడు తదితర రైతులకు చెందిన చెరకు పంటను ధ్వంసం చేశాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా కొమరాడ, జియ్యమ్మ వలస, గరుగుబిల్లి మండలాల్లోని ఏనుగులు గుంపు సంచరిస్తూ పదుల సంఖ్యలో మనుషులు ప్రాణాలను, మూగజీవాలను గాల్లో కలిపేశాయని, వేలాది ఎకరాల పంట నష్టాన్ని కలిగిస్తూ కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు, అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఏనుగులు తరలింపునకు శాశ్వత పరిష్కారం ఉందా లేదా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏనుగులు తరలింపుకు ఎలిఫెంట్‌జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ అది ఆచరణ కాకపోవడంతో రైతులు ఇప్పటి తెలుగు దేశం ప్రభుత్వం పాలకులైన ఏనుగులు తరలింపుకు పరిష్కారం చూపుతారా? లేదా అని ఎదురుచూస్తున్నారు.

పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్‌పి ఆరా

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక పోలీస్ స్టేషన్లో పెండింగ్ ఉన్న కేసుల పూర్వకతపై ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి ఆరా తీశారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పోలింగ్ స్టేషన్లో ఉన్న పలు కేసులకు సంబంధించిన రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న కేసుల పురోగతిపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో గల అన్ని పోలీస్ స్టేషన్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులైన గంజాయి, నాటు సారా అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజలు నిషేధిత వస్తువులు అక్రమ రవాణా, అమ్మకాలపై పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే అంతర్రాష్ట్ర రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ప్రమాదాల నివారణకు ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎప్పటికప్పుడు డ్రింక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్న వారిపై కేసులు కడుతూ, వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆహ్లాదకరమైన వాతావరణ కనిపిస్తుందన్నారు. పోలీస్ సిబ్బందికి ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ అడిగిన పలు విషయాలకు ఎస్సై నీలకంఠ సమాధానాలు చెప్పారు. మండలంలోని క్రైమ్ రేట్ తగ్గించేలా పోలీసుల పనితీరు ఉండాలని ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే లైసెన్స్ రద్దు

గుమ్మలక్ష్మీపురం : వాహనదారులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్‌పి ఎస్‌వి మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది క్వార్టర్స్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందన్నారు. సూసైడ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, అక్రమ నాటు సారా వంటకాలు, అమ్మకాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సిఐ సత్యనారాయణ సూచించారు. ప్రధానంగా రోడ్లు గుంతలు ఎక్కువగా ఉన్నాయని ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపడతామన్నారు. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మావోయిస్టు కదలికలు ఏమైనా ఉన్నాయా అని అడిగిన విలేకరుల ప్రశ్నకు సమాధానంగా ఒడిశా సరిహద్దు కన్నా ఇక దూరంగా ఉన్నాయని వాటిపై ఎప్పటికప్పుడు నిఘా సంస్థలు, పోలీస్ శాఖ స్పెషల్ పార్టీలతో కూంబింగ్ నిర్వహించి మావోయిస్టు కదలికలు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కురుపాం : స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి మాధవరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో గల పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చి ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విద్యార్థులు సీజనల్ జ్వరాలకు గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి ఆదేశించారు. ఈ మేరకు రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల నమోదు రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఇటీవల కాలంలో జ్వర లక్షణాలతో ఎంత మంది ఉన్నారు, వారికి నిర్వహించిన పరీక్షలు, అందజేసిన చికిత్స, ఇంకా ఎవరైనా ఉన్నత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారా తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. వ్యాధి నయమయ్యే వరకు వసతిగృహ, వైద్య సిబ్బంది పర్యవేక్షణ తప్పనిసరి అని ఆదేశించారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది మలేరియా నిర్ధారణ పరీక్షలు జరపగా నెగెటివ్‌గా నమోదైతే అవసరమైన వారికి మందులు అందజేశారు. సిక్ రూమ్ నిర్వహణ సక్రమంగా ఉండాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి చేతుల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హాస్టల్ పరిసరాల్లో నిల్వ నీటి ప్రదేశాలు ఉన్నాయా లేదానని పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యపరమైన ఎటువంటి సమస్యలున్నా వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, వైద్యాధికారులు అనూష, ధరణి, ప్రిన్సిపాల్ సింహాచలం, వైద్య సిబ్బంది శంకర్, ఉష, ఊర్మిళ, బంగారు నాయుడు, హాస్టల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు



విద్యార్థులకు అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఓ



పెచ్చులూడిపోయిన స్టోర్ రూం పైకప్పు

ప్రమాదకరంగా పిటిజి భవనాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి పిటిజి పాఠశాల, కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కురుస్తున్న వర్షాలకు పాఠశాలలోని డార్మెంటరీ భవనం లోపల భాగం పైకప్పు పూర్తిగా పెచ్చులోడి ప్రమాదకరస్థాయిలో ఉంది. ముందస్తు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఇక్కడ నుంచి వేరే భవనానికి మార్చారు. మరోవైపు కళాశాలలో గల స్టోర్ రూమ్ పైకప్పు కూడా పూర్తిగా పాడైంది. పిటిజి పాఠశాల సందర్శనకు వెళ్లిన ఎమ్మెల్యే జగదీశ్వరికి సిబ్బంది శిథిలమైన భవనాలు చూపించారు. భవనాలు పూర్తిగా కూలిపోక ముందే అధికారులు స్పందించి వీటిని తొలగించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని, కొత్త వాటిని నిర్మించాలని కోరుతున్నారు.

చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను స్థానిక డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధకంగా చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. బడి బయట విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు. డ్రాపౌట్స్ ఉండకూడదన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు డిజిటల్ బోధన ఏ విధంగా ఉందో తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎఎంఒ కోటిబాబు, డిప్యూటీ వార్డెన్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు అండగా దీక్షలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

శివ్వాం బాధితులకు పెరుగుతున్న మద్దతు


ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

శివ్వాం దళితుల భూ సమస్య పరిష్కరించాలని, జిల్లాలో పేదల భూ సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు పెరుగుతుంది. 9వ రోజు మంగళవారం దీక్షా శిబిరంలో ఉన్న బాధితులకు జిల్లా శ్రామిక మహిళా సంఘం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుల సాగు చేస్తున్న భూమి వారికి అప్పగించాలని, భూ సమస్య పరిష్కరించాలని, దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం దళితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర, ఉమారాణి, లక్ష్మి, ఉషా, సిఐటియు జిల్లా కోశాధికారి జివి రమణ, నాయకులు బి.సూరిబాబు, కెవిపిఎస్ నాయకులు మత్స రామారావు, పాలక చిన్నయ్య, అప్పమ్మ, పాపమ్మ, దుర్గారావు సుందర్రావు పాల్గొన్నారు.

వరిలో నిల్వ ఉన్న నీటిని బయటకు మళ్లించాలి

ప్రజాశక్తి - కురుపాం

వరి ఆకుమడుల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.ధ్రువ అన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలతో కలిసి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మ వలస మండలాల్లో వరి పొలాలను, ఆకు మడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ఉద్దేశించి మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నారుమడులు, నేరుగా విత్తిన వరిలో నిలిచిన వర్షపు నీటిని బయటకు మళ్లించే ప్రయత్నాలు నిల్వ ఉన్న నీటిని బయటకు మళ్లించి 5 సెంట్లలో వేసిన నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలని సూచించారు. అరటి పంటలో సిగెటోక ఆకు మచ్చలు గమనించినట్టయితే ప్రాపికోనా జెల్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట ప్రతిభ గురుకుల పాఠశాలను ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఎంఇఒ జి.సూర్య దేవుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు పొందుతున్న సౌకర్యాలు, విద్య కోసం అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఈ సీజన్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - భామిని

గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వ్యాప్తి నివారణకు వైద్యుల సూచనలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు తెలిపారు. బాలేరు పిహెచ్‌సి పరిధిలోని కారిగూడ, పోలవరంలో ప్రతి ఇంటిలో దోమల నివారణకు ఏసిఎం5శాతం మందును మంగళవారం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని గ్రామసులకు సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపాన గల చిదిమి గ్రామ జంక్షన్ మలుపు వద్ద వంతెన వద్ద ఈనెల 21న పాలకొండ నుండి వచ్చిన లారీ వంతెనకు ఒకవైపు ఉన్న గోడను ఢీకొన్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు ఆ స్థలాన్ని మంగళవారం పాలకొండ డిఎస్‌పి జీవీ కృష్ణారావు పరిశీలించారు. ఇక్కడ ఆర్ అండ్ బి అధికారులకు విషయాన్ని చేరవేసి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో స్టాప్ బోర్డులు, డ్రమ్ములు వంటివి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని స్థానిక ఎస్సై ఫక్రుద్దీన్‌ను ఆదేశించారు.



ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా గిరిజనులు ఆరోగ్యం కాపాడుకోవాలని దుమ్మంగి సర్పంచి పాలక క్రాంతికుమార్ సూచించారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని కోసింగిభద్రలో మంగళవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న వీధి కాలువలు పరిశుభ్రపరిచారు. వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించారు. గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ చేపట్టినట్లు సర్పంచి తెలిపారు. మలేరియా మందులు పిహెచ్‌సిల నుంచి వెల్నెస్ సెంటర్లకు సక్రమంగా పంపిణీ చేయాలని అధికారులను కోరారు. మలేరియా జ్వరాలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని అధికారుల స్పందించి దగ్గర్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ గౌరీ శంకర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కపిల్ దేవ్, సిబ్బంది ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ విషయంలో స్థానిక పంచాయతీ సిబ్బందితో సహకరించాలని పంచాయతీరాజ్ శాఖ ఇఇ, మండల ప్రత్యేక అధికారి కృష్ణాజీ అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాలు సందర్భంగా మంగళవారం ఆయన మండలంలోని పెద్దబొండపల్లి, ఎంఆర్ నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపిడిఒ అఖిబ్ జావేద్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సర్పంచులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు వంగపండు లక్ష్మి, సవరపు తౌడమ్మ వంగపండు త్రినాధ నాయుడు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల వద్ద శుభ్రం

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని వివిధ వాటర్ ట్యాంకుల చుట్టు పక్కల మంగళవారం శుభ్రం చేసినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా 5,6,15,16,23,24 వార్డుల్లో ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్యాంగ్ వర్క్స్ వార్డుల పరిధిలో ఉన్న మున్సిపల్ కార్యాలయం వెనుక, జగన్నాధపురం, కొత్తవలస, బెలగాం వాటర్ ట్యాంకుల చుట్టు పక్కల ప్రదేశాలను శుభ్రం చేయడం, పూడిక తీతపనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ తదితర పనులు ఇందులో భాగంగా చేపట్టామని ఆయన వివరించారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఇ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ రామారావు, మేస్త్రీలు గోపాల్, సాయి, శానిటేషన్ సెక్రెటరీ అచ్చుత్ పాల్గొన్నారు.



గమ్మలక్ష్మీపురం : మంచినీటి పథకం వద్ద శుభ్రం చేస్తున్న సర్పంచి



ఉపాధ్యాయుడి రాకకోసం ఎదురు చూస్తున్న డంగభద్ర గిరిజన విద్యార్థులు

ఉపాధ్యాయుడి కోసం చిన్నారుల ఎదురుచూపు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని డంగభద్ర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. గత ఎనిమిది రోజులుగా పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువ కారణంగా ఆ పాఠశాలను గతంలో ఎత్తివేశారు. దీంతో 2016లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఐటిడిఎ అధికారులు జిపిఎస్ పాఠశాలగా మార్చారు. ప్రస్తుతం అక్కడ 16 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి విద్యా ప్రమాణాలు బాగున్నప్పటికీ ఈనెల 13 నుండి ఇక్కడికి ఉపాధ్యాయుడు రావడంలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ పాఠశాల వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.రవి ప్రసాద్ తెలిపారు. డంగ భద్రవలస జిపిఎస్ టిడబ్ల్యూ పాఠశాలకు సిఆర్‌టిగా ఎంపి వెంకటరమణమూర్తి అనే ఉపాధ్యాయుడు వెళ్లేవారని, అయితే ఇటీవల వారిని ఐటిడిఎ అధికారులు రెన్యువల్ చేయకపోవడంతో ఆయన పాఠశాలకు రావడంలేదని, ఈయన స్థానంలో వేరొక ఉపాధ్యాయుని పంపిద్దామన్నా తమ పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు ముగ్గురే ఉన్నారని తెలిపారు. డంగభద్రవలస లోనే కాకుండా అనేక మంది సిఆర్‌టిలు ప్రస్తుతం ఐటిడిఎ అధికారులు తీరుకు నిరసనగా ఆర్డర్ తీసుకున్న వారు కూడా పాఠశాలకు వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఇఒలు ఎం.నాగ భూషణరావు, ఎం.శ్రీనివాసరావు మంగళవారం గెడ్డతిరువాడ పంచాయితీ చిలకలవాని వలస గ్రామ పాఠశాల నుండి ఎంటిఎస్ ఉపాధ్యాయుడు బడే శ్రీనివాసరావును పంపించామన్నారు. అయినా ఆయన కూడా ఉదయం 11:30 గంటల వరకు పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు

కురుపాంలోనే ఏకలవ్య పాఠశాలను నడపాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఏకలవ్య పాఠశాలను కురుపాంలోనే నడిపి స్థానికంగా అర్హత ఉన్న వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రావాడ జంక్షన్ కాంప్లెక్స్ వద్ద విలేకరులతో మాట్లాడారు. కురుపాంకు మంజూరైన ఏకలవ్య పాఠశాల ఇంతవరకు పార్వతీపురంలో నడుస్తుందన్నారు. కురుపాంలో నిర్మించిన పాఠశాలను అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్న దొర ప్రారంభించారని, అయినా నేటికీ కురుపాంలో తరగతులు ప్రారంభించక పోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపల్‌ను బదిలీ చేయకుండా ఉంచాలని, ఎందుకంటే ఆయనకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మాట్లాడే విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారని కావున ఆయననే కొనసాగించాలని కోరారు. అలాగే పాఠశాలలో ఉత్తర భారతీయ ఉపాధ్యాయులను నియమించకుండా స్థానికంగా ఉన్న అర్హత కలిగిన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని కోరారు. కావున ప్రభుత్వం పై సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తోయక ప్రకాశరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పి.నరేష్, జి.గంగరాజు, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జునరావు వర్థంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడలో కామ్రేడ్ మండంగి అర్జునరావు మూడో వర్ధంతి సభ బుధవారం నిర్వహిస్తున్నామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య కోరారు. మండంగి అర్జునరావు శ్రీకాకుళం గిరిజన రైతంగా పోరాటం లో పాల్గొని గిరిజనులకు అనేక చట్టాలు సాధించి పెట్టడంలోను, జిసిసిలు, గిరిజన యువతకు ఉద్యోగాలు, భూములు గిరిజనులకు పంచిపెట్టడం, అనేక చట్టాలు సాధించడంలో కృషి చేశారన్నారు. ఆయన వర్ధంతి సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

27న రెండో విడత ఐటిఐ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 27న శనివారం భద్రగిరి ఆర్ ఐటిఐలో రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు అడ్మిషన్లకు హాజరుకావాలని కోరారు. సెప్టెంబర్ నుంచి ఇంగ్లీష్ లాంగ్వేజ్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సీనియర్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



లే అవుట్‌లో రోడ్లును తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

అనధికార లేఅవుట్‌లో రోడ్లు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలోని రెండోవార్డు సచివాలయం పరిధిలో గల సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో మున్సిపల్ అనుమతులు లేకుండా వేసిన లే అవుట్‌లో మంగళవారం సాయంత్రం కమిషనర్ ఆదేశాల మేరకు జెసిబి సహాయంతో రోడ్లను తొలగించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు లేకుండా కొందరు యజమానులు ఈ లేఅవుట్ వేశారన్నారు. దీనిపై సంబంధిత యజమానులకు నోటీసులు అందజేసినా పట్టించుకోకపోవడంతో రోడ్లను తొలగించామన్నారు. మున్సిపల్ పరిధిలో ఎవరైనా కొత్తగా లేఅవుట్లను వేస్తే టౌన్ ప్లానింగ్ అనుమతులు తీసుకుని వేయాలని, లేనిచో ఇటువంటి చర్యలు చేపట్టడతామని హెచ్చరించారు.

పలు గ్రామాల్లో పంటల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుతం వరి నారుమడులకు ఎంటియు 1121 రకానికి కొద్దిగా జింక్ లోపం కనిపిస్తుందని, నివారణకు జింక్ చిలామిన్ లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలని, అవసరమైతే పది రోజుల వ్యవధిలో రెండోసారి కూడా పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మెట్ట నారుమడుల్లో ఇనుము ధాతు లోపం కూడా కనిపిస్తుందని, తప్పనిసరిగా నారుమడికి నీరు పెట్టుకుంటే ఇనుము ధాతు లోపం నివారణ అవుతుందని అన్నారు. మండలంలోని కోస్టవలస, చెరుకుపల్లి, పి.కోనవలస గ్రామాల్లో వరి, పత్తి, పచ్చిరొట్ట పంటలను మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం మబ్బు వాతావరణం, జల్లులు కురుస్తున్నందున పత్తి పంటలో పచ్చదోమ ఎక్కువగా కనిపిస్తుందన్నారు. అలాగే పేను బంక కూడా కనిపిస్తుందని, వర్షాలు తగ్గిన తర్వాత రసం పీల్చు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని అన్నారు. అలాగే ఆకుమచ్చ తెగుళ్లు కూడా వ్యాపించే అవకాశం ఉందని, కావున రైతులు అప్రమత్తమై వ్యవసాయాధికారుల సూచనలను పాటించి పంటలను రక్షించాలన్నారు. కార్యక్రమంలో విఎఎ వినోద్ కుమార్, నాగమణి, రైతులు పాల్గొన్నారు

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ కె.జయప్రకాశ్ వీఆర్వోలను ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విఆర్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా నదీ తీర పరివాహక ప్రాంతాలను సందర్శించి నదిలో నీటి ప్రవాహ అంశం తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అలాగే ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలన్నారు. ఎవకి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరిపితే సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మనాయుడు, విఆర్వోలు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. ఇందులో భాగంగా మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రత్యేక అధికారి రాధాకృష్ణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి 8,9,10 వ తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిందిగా సూచించారు. ఇప్పటి నుంచే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన అవసరముందని, శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.శశిధర్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, కార్యదర్శి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2003 -04 పదో తరగతి చదువుకున్న విద్యార్థి ఊయక బుజ్జి అనారోగ్యంతో మృతిచెందనంతో ఆ కుటుంబాన్ని తోటి పూర్వ విద్యార్థులు రూ.14000 ఆర్థిక సాయం అందించారు. బుజ్జి తమకు ఎంతో ప్రాణ స్నేహితుడాలా ఉండేవాడని ఆయన మరణం దిగ్భ్రాంతి కలిగిస్తుందని చిన్న గీశాడ పంచాయతీ కార్యదర్శి నరేష్ అన్నారు.

పొలంలో మహిళ మృతి

ప్రజాశక్తి- మెరకముడిదాం

పొలంలో వరినాట్లు వేస్తుండగా వివాహితకు మూర్ఛ వచ్చి మృతి చెందిన ఘటన మండలంలోని ఊటపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. బుధరాయవలస ఎస్ఐ లోకేశ్వర రావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన బొత్స హైమావతి (27) ఉదయం పొలంలో వరినాట్లు వేస్తుండగా మూర్ఛ వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సిఐ ఆధ్వర్యంలో ఘనటా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆజాద్‌కు నివాళ్లు అర్పిస్తున్న సంజీవనాయుడు, గ్రామపెద్దలు

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో చంద్రశేఖర్ అజాద్ జయంతి వేడుకలు మంగళవారం స్థానిక నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సిఐఎఫ్ జవాన్ పెంకి ఆనంద్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు జరుపుకొని, ఆయన్ను ఇలా జ్ఞాపకం చేసుకోవడం మంచి పరిణామమని అన్నారు. చంద్రశేఖర్ అజాద్ వంటి ఎంతోమంది ఉద్యమ పోరాట నాయకుల కృషి ఫలితమే స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. నాడు వారు ప్రాణాలు సహితం లెక్కచేయకుండా వెన్నుచూపి దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసి ఈనాడు మనకు ఈ స్వాతంత్రాన్ని ఇచ్చారని తెలిపారు. వారి విలువలు, ఆశయాలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశి నాయుడు, గౌరీ శంకర్ బ్యాండ్ పార్టీ మాస్టర్ శ్రీనివాస్‌రావు, యందవ ఆనంద్, కోట దాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి

ఆర్ అండ్ బి మంత్రికి ఎమ్మెల్యే జగదీశ్వరి వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆర్‌అండ్‌బి మంత్రి బిసి జనార్ధన్ రెడ్డికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వినతిపత్రం ద్వారా కోరారు. మండలాల్లో రోడ్లు పరిస్థితి అధ్వానంగా ఉందని, ప్రధాన రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి ఎమ్మెల్యే విన్నవించారు. వర్షాకాలం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించి అభివృద్ధి పరుస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. రావాడ, గుమ్మడి గెడ్డ అనుసంధానం, తోటపల్లి ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు. పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులకు నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రిని ఎమ్మెల్యే కోరారు.



పోలమాంబకు పూజలు ఆలయ పెద్దలు

పోలమాంబ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - మక్కువ

శంబరలో పోలమాంబ అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. మంగళవారం దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ముగ్గురు అమ్మవార్లకు శాఖంబరి ఉత్సవం శాస్త్రోక్తముగా జరిగింది. ముగ్గురు అమ్మవార్లను సుమారు 50 రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. విజయనగరానికి చెందిన కప్పగంతుల శ్రీనివాసశర్మచే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ, తీళ్ల పోలినాయుడు, అల్లు వెంకటరమణ, అక్కేన తిరుపతి రావు, నైదాన తిరుపతిరావు, గంజి కాశి నాయుడు, నైదాన సూర్యనారాయణ, గ్రంధి గున్నరాజు మద్ది రాము, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

తల్లికి వందనం ఎప్పుడు?


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది బడికి వెళ్తే అంత మందికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఎప్పుడు ఇస్తారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఈపాటికే "అమ్మ ఒడి" వచ్చేదన్నారు. తద్వారా చదువుల అవసరాలకు సకాలంలో ఉపయోగపడేదన్నారు. తల్లికి వందనం పథకానికి నేటికీ ఎటువంటి విధి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పేదలందరికీ తల్లికి వందనం ఇవ్వాలని, ఆగస్టు 15 నాటికి ఇవ్వాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - సీతంపేట

మండలం కేంద్రంలో దోనుభాయి జంక్షన్ పార్కు సమీపాన బస్సును కారు ఢీ కొట్టింది. పాలకొండ నుండి కొత్తూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుడి కోసం పార్కు వద్ద ఆపగా వెనుక నుండి ఒడిశా వెళ్తున్న కారు బస్సుకు ఢీకొట్టింది. దీంతో బస్సుకు వెనుక భాగం, కారుకు ముందు భాగం డ్యామేజ్ అయింది. అయితే కారులో ఉన్న వారికి గానీ, బస్సులో ఉన్నవారు గానీ ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ప్రమాదంలో ముందు భాగం నుజ్జయిన కారు